క్లుప్తంగా

నేడు కృష్ణాష్టమి

ముస్తాబవుతున్న గోపాలస్వామి ఆలయం


కల్మిదోనగుట్ట దేవాలయం

తలకొండపల్లి: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు మండల పరిధి చుక్కాపూర్ కల్మిదోనగుట్ట గోపాలస్వామి దేవాలయం ముస్తాబవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం ఆలయ క్రియాశీలక కార్యవర్గ సభ్యుడు కృష్ణమూర్తి శర్మ మాట్లాడారు. సోమవారం కృష్ణాష్టమిని పురస్కరించుకుని ఆలయంలో కన్నయ్యకు ప్రత్యేక పూజలతో పాటు.. భాగవతా పురాణం, కృష్ణుడిని లాలించే ఉయ్యాల పాటలు, డ్రైఫ్రూట్స్‌తో నైవేద్యం సమర్పణ, కీర్తనలు, భజనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. 27న సాయంత్రం ఉట్లు కొట్టే కార్యక్రమం ఉందని చెప్పారు. భక్తుల సౌకర్యార్థం సౌకర్యాల ఏర్పాట్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

'తీజ్' వేడుకలకు ఆహ్వానం


ఎమ్మెల్యే కసిరెడ్డిని కలిసిన గిరిజన నాయకులు

కడ్తాల్: మండల పరిధి గానుగుమార్లతండాలో ఈ నెల 29న నిర్వహించే తీజ్ వేడుకలకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని గిరిజన నాయకులు ఆహ్వానించారు. ఈ మేరకు ఆదివారం ఆయన నివాసంలో ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి లక్పతినాయక్, మోత్యానాయక్, రాజునాయక్, గోప్యానాయక్, శక్రునాయక్, భాస్కర్‌నాయక్, రాజు, హరి తదితరులు ఉన్నారు.

భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు

తలకొండపల్లి: బోనాల పండుగ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ పరిసర ప్రాంతంలో తగిన ఏర్పాట్లు చేయిస్తున్నానని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ అన్నారు. మండల పరిధి గట్టుఇప్పలపల్లిలో ఆదివారం యాదవుల ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి బోనాల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన విద్యుత్ సరఫరాకు కావాల్సిన ఏర్పాట్లతో పాటు, ఇతర మౌలిక వసతులను సమకూర్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జయమ్మ, వెంకటయ్య, గౌడ సంఘం నియోజకవర్గ కన్వీనర్ అశోక్‌గౌడ్, శరత్‌చంద్రశర్మ, కృష్ణయ్య, సత్తిరెడ్డి, చెన్నారెడ్డి, మల్లేశ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

కడ్తాల్: మండల కేంద్రంలోని కంఠమహేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి సింగిల్‌విండో చైర్మన్, గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా రూ.10 వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ.. ఆదివారం గుప్తాను ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు మాలే మల్లేశ్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడు గణేశ్‌గౌడ్, నాయకులు కేశవులుగౌడ్, శివగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీరాములుగౌడ్, రమేశ్‌గౌడ్, హరీశ్, శేఖర్, మహేందర్, జగదీశ్, చిన్నా, నాగులు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా ఉత్సవాలు జరుపుకోవాలి


పూజాకార్యక్రమంలో నాయకులు

కడ్తాల్: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక అని పలు పార్టీల నాయకులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని మైసమ్మ, ఈదమ్మ, పెద్దమ్మ, బీరప్ప, మడేలు స్వామి ఆలయాలను వారు సందర్శించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆ దేవాలయాల వద్ద బోనాల ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. పార్టీలకు అతీతంగా ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్ గుప్తా, సింగిల్‌విండో డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, మాజీ వైస్‌ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, హన్మానాయక్, యాట నర్సింహ, పరమేశ్, బీక్యానాయక్, బీచ్యానాయక్, నర్సింహ, వెంకటేశ్, శ్రీను, చంద్రశేఖర్, మల్లేశ్‌గౌడ్, రాంచందర్, బాలరాజు, రాములు, శ్రీశైలం, జగన్ ఉత్సవ కమిటీ చైర్మన్ సత్యం యాదవ్ తదితరులు ఉన్నారు.

తహసీల్ భవనం పూర్తయ్యేనా?

- రెండున్నరేళ్లుగా కొనసాగుతున్న నిర్మాణం
- నిధుల లేమితో నిలిచిన పనులు!
- అసౌకర్యానికి గురవుతున్న అధికారులు, ప్రజలు


అసంపూర్తిగా తహసీల్దార్ భవనం


సంపులో కలుషితమైన నీరు

ఇబ్రహీంపట్నం: నిజాం కాలం నాటి శిథిలావస్థ తహసీల్దార్ భవనాన్ని కూల్చివేశారు. కొత్తగా నిర్మించేందుకు రెండున్నరేళ్ల క్రితం శ్రీకారం చుట్టారు. కానీ ఏళ్లు గడుస్తున్నా.. అసంపూర్తి పనులతో దర్శనమిస్తోంది. నిధుల లేమితోనే నిర్మాణ పనులు నిలిచిపోయినట్లు తెలుస్తోంది.

ఇరుకు భవనంతో ఇక్కట్లు

నూతనంగా తహసీల్దార్ భవనం నిర్మించేందుకు ఫిబ్రవరి 2022లో నాటి ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. అనంతరం స్లాబ్, గోడల వరకు నిర్మాణం కొనసాగింది. ఆ తరువాత నిధుల సమస్యతో పనులు నిలిచిపోయినట్లు తెలుస్తోంది. కాగా.. ఈ భవనం పూర్తయ్యే వరకు తహసీల్ కార్యాలయ కార్యకలాపాలు జెడ్పీ విశ్రాంతి భవనంలోకి మార్చగా.. ఇరుకు గదుల్లో సౌకర్యాల లేమితో అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. అధికారులతో పాటు భూ రిజిస్ట్రేషన్లు, ఇతర పనుల కోసం వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

ఆరు నెలల్లో..

తహసీల్ భవన నిర్మాణాన్ని ఆరు నెలల్లో పూర్తిచేసి, వినియోగంలోకి తెస్తామని నాటి ప్రజాప్రతినిధులు, అధికారులు చెప్పారు. కానీ రెండున్నర సంవత్సరాలు గడిచినా భవనం అసంపూర్తిగా మిగిలిపోవడం శోచనీయం.

మందుబాబులకు అడ్డాగా..

అసంపూర్తి నిర్మాణంలో ఉన్న తహసీల్ భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ప్రహరి, గేటు లేదు. చుట్టూ పిచ్చిమొక్కలు, చెట్లు పెరిగి పొదల మాటున ఉండటంతో మందుబాబులు, జూదరులు భవనాన్ని యథేచ్ఛగా వినియోగిస్తున్నారు.

పేరుకుపోయిన చెత్తచెదారం

నిర్మాణంలో ఉన్న భవనం చుట్టూ చెత్తచెదారం, పిచ్చి మొక్కలతో అపరిశుభ్రత నెలకొంది. పాత బస్టాండుకు వెళ్లే ప్రధాన రహదారిపై ఉండటమే గాక, చుట్టూ ఇతర శాఖల కార్యాలయాలు ఉన్నాయి. భవనం చుట్టూ పేరుకుపోయిన చెత్త, పిచ్చి మొక్కలను తొలగించాలని పరిసర ప్రాంత ప్రజలు కోరుతున్నారు. భవన నిర్మాణంలో భాగంగా తీసిన సంపులో నిలువ చేసిన నీరు.. పూర్తిగా కలుషితం అయ్యాయని, తద్వారా దోమలు బాగా పెరిగాయని ఆందోళన చెందుతున్నారు. తొలుత ఈ నీటిని తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

నిధుల కొరత.. ప్రతిపాదనలు

భవన నిర్మాణ పనులు నిధుల కొరత కారణంగా నిలిచిపోయినట్లు తెలుస్తోంది. డీఎంఎఫ్‌టీ(డిస్ట్రిక్ మినరల్ ఫండ్ ట్రస్ట్)కింద మంజూరైన రూ.1.25 కోట్లతో నిర్మాణ పనులు చేపట్టారు. నిధులు ఉన్నంత వరకు సదరు కాంట్రాక్టర్.. పనులు చేసి, చేతులు దులుపుకొన్నట్లు సమాచారం. ఇదే అంశంపై ఇంజినీరింగ్ విభాగం అధికారులు మాట్లాడుతూ.. భవనం పూర్తి కావాలంటే మరో రూ.కోటి నిధులు అవసరం అవుతాయని, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొంటున్నారు. నిధులు మంజూరు అనంతరం పనులు ప్రారంభం అవుతాయని స్పష్టంచేస్తున్నారు.

వినియోగంలోకి తేవాలి



భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి. ప్రస్తుతం ఇరుకైన అతిథి గృహంలో తహసీల్ కార్యాలయం కొనసాగుతోంది. ఇరుకు గదులు, సౌకర్యాల లేమితో అధికారులతో పాటు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నిర్మాణాన్ని పూర్తిచేసి, భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తేవాలి.

– యాదగిరి, ఇబ్రహీంపట్నం

ప్రజాసేవే జీవిత లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: గెలిచినా ఓడినా ప్రజాసేవే తన జీవిత లక్ష్యమని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జైపాల్ జన్మదిన వేడుకలను సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్ గుప్తా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేకు బీఆర్‌ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. శాలువాలు కప్పి సత్కరించారు. అనంతరం యాదవ్ కేక్‌కట్ చేయగా.. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఒకరినొకరు స్వీట్లు తినిపించుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్ నాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ గుప్తా, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీ నర్సింహారెడ్డి, తులసీ రాంనాయక్, మాజీ ఎంపీటీసీ గోపాల్, రమేశ్, మార్కెట్ మాజీ డైరెక్టర్ లాయక్ అలీ, నాయకులు జోగువీరయ్య, నర్సింహ్మా, శ్రీను, ఈర్షాద్, గణేశ్ పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జైపాల్ యాదవ్ కేక్ కట్‌చేశారు. ఇందులో ఆ పార్టీ మండల అధ్యక్షుడు అర్జున్‌రావ్, పట్టణ అధ్యక్షుడు పత్యానాయక్, సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్, నాయకులు శంకర్, పరమేశ్, వెంకటయ్య, వెంకటేశ్, సయ్యద్ ఖలీల్, బాలస్వామి, సతీష్, ప్రసాద్, కుమార్ ఉన్నారు.

ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండాలి

సంఘం మండల అధ్యక్షుడు యాదగిరి

తలకొండపల్లి: పార్టీలకు అతీతంగా ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు బోల యాదగిరి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నర్సింలు పిలుపునిచ్చారు. హైదరాబాద్ తొలి మేయర్, ముదిరాజ్ మహాసభ వ్యవస్థాపకుడు కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సామాజిక, రాజకీయ ఉద్యమాలకు నాంది పలికిన కృష్ణస్వామి జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. బహుజనుల అభివృద్ధికి కృష్ణ ఎంతగానో కృషి చేశారని, హిందూ ధర్మ పరిషత్ స్థాపించి దళిత జనోద్ధరణ, కుల వ్యవస్థ, అంటరాని తనానికి వ్యతిరేకంగా ప్రచారం చేసిన మహనీయుడు కృష్ణస్వామి కొనియాడారు. ఆయన బాటలో నడిచి.. భవిష్యత్ తరాలకు బాసటగా నిలుద్దామని పేర్కొన్నారు. అదే సమయంలో ముదిరాజ్‌ల హక్కుల సాధనకు సమష్టిగా పోరాడదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నర్సింహ, అధ్యక్షుడు యాదగిరి, సంఘం నియోజకవర్గ కార్యదర్శి అనిల్, యూత్ అధ్యక్షుడు నాగరాజు, నూకం శేఖర్, వెంకటయ్య, శ్రీరాములు, గణేశ్, శ్రీకాంత్, లక్ష్మయ్య, మల్లయ్య, రాము, నరేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి వేడుకలో నాయకులు

జూనియర్ విద్యార్థులకు స్వాగతం



మాట్లాడుతున్న డాక్టర్ నాగభూషణరావు

అబ్దుల్లాపూర్‌మెట్: బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతోత్సవం నిర్వహించారు. మండల పరిధి పిగ్లీపూర్ గ్రామంలో అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో విశ్రాంత సివిల్ ఇంజినీర్ డాక్టర్.నాగభూషణ రావు, ఇండస్ట్రీస్ ఎక్స్‌పర్ట్ శ్రీధర్, అన్నమాచార్య విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అభిషేక్‌రెడ్డిలు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతంగా ఎదగాలని సూచించారు. ప్రిన్సిపాల్ డా.పి.వి.కృష్ణమూర్తి మాట్లాడుతూ.. విద్యార్థులకు తమ విద్యాసంస్థలు నాణ్యమైన విద్యను బోధిస్తూ.. ప్రతిభావంతులుగా తీర్చుదిద్దుతున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రోడ్డుపై ఇసుక..

జారి పడుతున్న వాహనదారులు


సాగర్ రహదారిపై పేరుకుపోయిన ఇసుక

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి సాగర్ రహదారిపై మట్టి, ఇసుక పేరుకుపోయి.. వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరదనీరు పారడంతో.. రోడ్డుపై ఇసుక పేరుకుపోయి.. మేటలుగా తలపిస్తోంది. అయినా మునిసిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వారి నిర్లక్ష్యం కారణంగా గాలిలో దుమ్మధూళి లేచి వెనకాల వచ్చే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని, పాదచారులు, రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణదారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనాలు జారి కిందపడి, చోదకులు గాయాల పాలవుతున్నాని తెలిపారు. అధికారులు త్వరగా స్పందించి రహదారిపై ఇసుకను తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఏఈ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్నం అంబేద్కర్ కూడలి, మంచాల రోడ్డు, మున్సిపల్ కార్యాలయాల ప్రాంతాల్లో సరాఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

నేత్రదానంతో ఇద్దరికి కంటిచూపు

ఆమనగల్లు: వ్యక్తి మరణానంతరం నేత్రదానం చేయడం వలన ఇద్దరికి కంటిచూపు ప్రసాదించవచ్చునని లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. దీనిపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఏటా ఆగస్టు 25నుంచి సెప్టెంబర్ 8 వరకు నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పక్షం రోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో గ్రామీణ స్థాయి ప్రజలకు అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నామని వెల్లడించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

తలకొండపల్లి: సదీర్ఘకాలం అనంతరం బాల్య మిత్రులందరూ ఏకం అయ్యారు. పాఠశాల వేదికగా సందడిచేశారు. ఆడుతూపాడుతు కేరింతలు కొట్టారు. మండల పరిధి వెల్జాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995–96 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు.. కుటుంబ సమేతంగా ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి చిలిపి చేష్టలు గుర్తుకు చేసుకుంటూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులు శ్యాంసుందర్‌రావు, బ్రహ్మాచారి, ఖాదర్‌పాషా, రామచందర్‌రావులను ఘనంగా సన్మానించారు.

ప్రతిపక్ష నేతల మాటలు నమ్మొద్దు

ఆమనగల్లు: ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిందని సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు ఎగిరిశెట్టి సత్యం అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీపై అసత్య ఆరోపణలు చేస్తున్న ప్రతిపక్ష పార్టీ నేతల మాటలను ప్రజలు నమ్మవద్దని సూచించారు. గతంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్.. రైతులకు రుణమాఫీ హామీ ఇచ్చి మోసం చేసిందని సత్యం ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా పాలన కొనసాగుతుందని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. రుణమాఫీ కాని వారు ఆందోళన చెందవద్దని, క్రమంగా అర్హులైన రైతులకు లబ్ధిచేకూరుతుందని చెప్పారు.


ఇబ్రహీంపట్నం: బోనంతో యువతి


ఆమనగల్లులో.. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


ఆమనగల్లు: బోనాల ఊరేగింపు


ఇబ్రహీంపట్నం: పోచమ్మ ఆలయంలో

బోనమెత్తిన పల్లెలు

- ఆలయాలను దర్శించుకున్న భక్తజనం
- పూజల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు

బోనాల సంబురాలు అంబరాన్నంటాయి. శ్రావణమాసం ఆదివారం పురస్కరించుకుని పల్లెలు, పట్టణాల్లో కంఠ మహేశ్వర స్వామి, పోచమ్మ, ఈదమ్మ, పెద్దమ్మ, బీరప్ప, మడేలు తదితర దేవతామూర్తులకు భక్తులు బోనమెత్తారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం భక్తజనం నెత్తిన బోనంతో పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపుగా దేవతల సన్నిధికి చేరారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. నైవేద్యంగా బోనం సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో పల్లెలు పచ్చగా ఉండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండేలా చూడు తల్లి అంటూ వేడుకున్నారు. – సాక్షి, నెట్‌వర్క్


కడ్తాల్‌లో.. మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్


యాచారం: నక్కర్తమేడిపల్లి గ్రామంలో.. పోతరాజు విన్యాసం


ఇబ్రహీంపట్నం: ఫలహారం బండి ఊరేగింపు


కడ్తాల్‌లో..


తలకొండపల్లి: దేవుని పడకల్‌లో..


కడ్తాల్‌లో..


ఆమనగల్లు: నెత్తిన బోనంతో యువతి


కడ్తాల్: మడేలు స్వామికి పూజలు చేస్తున్న రజక సంఘం నాయకులు